# హాస్యకథ మర్గమ్మ

పి.చంద్రశేఖర అజాద

"మనకిప్పుడు అర్జెంటుగా దుర్గడు కావాలి."

అన్నాడు నల్లగా ఉన్న గుర్నాథం!

అతనికి అంతకుముందు ఘనమైన ఉదరం ఉందనటానికి దాఖలాలున్నాయి.

"ఆడా-ఆడెక్కడ దొరుకుతాడు అన్నాడు" ఎదురుగా ఉన్న మనిషి.

అతను జుట్టుకి రంగేసుకున్నాడు. అక్కడక్కడా తెల్ల వెంట్రుకలు కనిపిస్తున్నాయి. ముఖంలో అనుభవం పేరుకుపోయింది. అతగాడు గుర్నాథం బామ్మర్ది.

"ఆడెక్కడ దొరుకుతాడంటే ఎతుక్కోవాల. ఆడుంటే యిశాపట్నంలో ఉంటాడు. లేదా బెజవాడలో ఉంటాడు. తిరపతి లోనన్నా ఉంటాడు తప్పితే నెల్లూరిలో ఉంటాడు. అంతకుమించి అయిద్రాబాదులో ఉండడుగాకుండడు" అన్నాడు.

అయినా బామ్మర్దికి ''ఎలగలేదని' తన ధరిని వివరించేడు.

'ఏంట్రా ఆ సూపు.' 'సూపు' మొకవొడా. అయిద్రాబాదొల్లకి మన తెలుగు భాషగానీ, తెలుగు సాంబారుగానీ పనిలా. యిజిటబుల్ పలావుంటే సాలు. అందుకే అదెంత గొప్పూరయినా దుర్గడికి అయిద్రాబాదవసరంలా.

బామ్మర్ది అంగీకరించేడు.

'అంచేత నాలుగయిదొందలట్టుకుని బయల్దేరిపో. ముందాడు ఎక్కడున్నా పట్టుకుని అమాంతం లేపు కొచ్చెయ్యాల. ఇరవయి రోజుల్లో హోటేలు పేరంభం జరిగిపోవాల మరి' అన్నాడు గుర్నాథం.

"నాలుగొందలతో దుర్గడిని తీసుకురానా! బావో - మనూళ్లో సుబ్బమ్మగారు నీల్లు రాసి అట్టు పైకి తీసుద్ది. దుర్గడికి ఆయిలు కావాలి. అదంతే."

"తెల్సులేరా ఏదొాక హరికథ చెప్పి కొట్టుకురా. మిగతాది నేను చూసుకుంటా."

"మనొల్ల కాదులే. అదే చేతయితే నీ కాడ పడుంటమెందుకు? ఈ పాటికి దేశంలోనూ "యిమానవెక్కి అమెరికా తిరిగేద్దును. ఆడికి పైసలు చూయించందే పనికాదు."



"సర్లే. మూడేలట్టుకుపో. అయినా డబ్బులు సూస్తే మడిసివి కాదు నువ్వు. లాడ్జింగ్‌లో మందేసుకు కూర్చుంటే డబ్బూ పోయి శని పట్టుద్ది."

"అదేంది బావా. అంత నమ్మకం లేకపోతే యాపారం సెయ్యటం కష్టం" అన్నాడు బామ్మర్ది "వోరి, బామ్మర్దిగా." యాపారం గురించి నాకు సెప్పమాకరా. నమ్మకంగా ఉంటే అది యాపారవెట్టా అవుద్దిరా. అంచేత ముందా డబ్బట్టుకుని బయలుదేరు. అడవాన్సు లిచ్చేకాడ జాగర్తరొరే అన్నాడు.

బామ్మర్ది డబ్బందుకుని 'లెక్కెట్టి' బయలుదేరేడు.

* * *

'యాపారం' గురించి నాకు సెప్పమాక అని గుర్నాథం అన్నాడంటే దానెనకాల 'యిస్టరీ' ఉంది.

'ఎక్టన్ సెన్ లేక ఎకరాలమ్మే సేరు' అని కూడా అంటా డంటే అందకూఉంది. హోటేలు పెట్టి 'యిరగదీసేయాలనే ' యింతకుముందు 'రొండెకరాలూ' ముక్క కలవక మూడెకరాలూ అమ్మేసాడు

ఇంతకుముందు అది మాంసం హోటేలు.

భోయనానికీ భోయనానికీ ముందు గుర్నాథం 'మందుచ్చు' కునేవాడు. హోటేలు బానే నడిచింది. మాంసం గొప్పగానే ఖర్చయ్యేది. గల్లాలో డబ్బులే ఉండేవికాదు.

"గుర్నాథవా నీకెందుకాహోటేలు. బంగారంలాంటి రొండె కరాలమ్మేస్తివి" అంటారెవరైనా.

"అదేంది. ఎవుడో వొకడు భోంచేశాడుగందా" అని నవ్వుతాడు

గుర్నాథం బామ్మర్ది కూడ మిగుల్చుకుంది లేదు.

రోజూ 'మాంసం' కూరతో భోయనాలూనూ, అప్పుడప్పుడు కాసింత 'మందు' మనకిఖాసుందింతే అంటాడు పిలసాఫికల్‌గా

ఇన్నిరోజులకి గుర్నాథం 'ఎనక్కి' తిరిగి చూసుకున్నాడు. తన మీద తనకే జాలి కలిగి పోయింది. బంగారం లాంటి పొట్ట కరిగిపోయింది. పొలాలు కరిగిపోయాయి. ముందు దర్జాగా కాలుమీద కాలేసుకుని, చుట్టూ అయిదారు కూరలెట్టుకొని భోంచేసే కార్యక్రమం లేకుండా పోయింది. 'మీగడ' కప్పులు లేవు.

ఇవన్నీ అలా ఉంచితే ఇంకా పొలాలు మిగిలున్నాయి. అంచేత ఎక్కడ పోయాయో అక్కడే 'ఎతుక్కుంటా' అని కొంతమంది దగ్గర ఫీలరొదిలేడు.

"గుర్నథవా- నీ జన్మకి పేకాటలో నయాపైస సంపాయించలేక సంపాయించలేవు" అని బల్లగుద్ది అందుకు కారణాలు చెప్పేడు.

"నీకు కంట్రోల్ లేదు. నీది షార్ట్‌టెంపర్. పేకాట కాడ కూ్ముంటే 'డ్రాపు' సేయటం ఉండదు. మిడిల్ డ్రాపూ ఉండదు. నువు నాశనమయ్యేది ఖాయవే. నీకు ముందూ ఎనకా గూడా నాశనవే. నీకున్న ఆనందవొకటే నువు నాశనవయినా పర్లా. పక్కోడికి ముక్క పడకూడదు. నీకు కలిసొచ్చి నాలుగు డబ్బులొత్తే 'ఆనందంతో' ఖర్చయిపోతాయి. అంచేత నువ్వు పేకాట దగ్గర ఎతుక్కుంటే దొరికేది ఎకరాలు గాదు. కీళ్ళనొప్పులూ, గాసు ట్రబులూ, అల్సరూ" "నిజవేనే" అనంగీకరించేడు గుర్నాథం.

ఓహోటలు పండితుడు ఇంకో సిద్ధాంతం చెప్పేడు.

అయ్యా - మాంసం హోటేలంటే ఎంత కష్టవుండాల. ఎంత నిఘా ఉండాల. అవసరమయితే శిబిచక్రవర్తిలా మాంసం కోసి అమ్ముకునేవోడి రాజ్జెం. దానికి కిటుకు కిచెన్‌రూంలో ఉంది. నువ్వు రెండు యాటపోతులు నరికించినా ఆడెవడో మంత్రంవేసినట్లు ముక్కలు మాయం అయిపోతాయి. ఎవరో బలిసిపోతారు. అది చేసే వాళ్ళు యేరే ఉన్నారు. అంచేత యిది నీకు పనికిమాలిన 'యాపారం'

ఇంతకు ముందు దెబ్బ తిని ఉన్నాడేమో గుర్నాథానికి ఇదీ సబబే అనిపించింది. అప్పుడో పండిత 'అయ్యరు' వారి సలహా ఇది.

"మీరు మీ ఆశయంలో ఏ మార్పూ తేనవసరంలేదు. హోటేల్ పెట్టుకోవచ్చు. మాంసాహారం బదులు కాఫీ, టీలూ, ఇడ్లెన్లు అమ్ముతాం. అవి కూడా తింటారు. తిననీండి. సాంబారు తాగుతారు. తాగనీండి. మీకు నష్టంరాదు. స్వీట్లు మాత్రం జాగ్రత్త. హార్లిక్సులూ, బోర్నవిటాలు మీ గల్లా ముందు పెట్టుకోండి. రెండు సంవత్సరాల తర్వాత మీ పొలాలు మీరు కొంటారు. నునుపుదేలతారు. అదే మంసాహారమయితే రాక్షసుడి 'పేసు' వస్తుంది. ఇంక మీరెంత పైకెల్తారో నేను చెప్పలేను."

గుర్నాథం దీన్ని ఆమోదించేడు.

తనకి కూడా సాంబారంటే ఇష్టం. చపాతీకుర్మా అంటే ఇష్టం. 'ఫలానా' చోట బాగున్నాయంటే ఎంత దూరమైనా నడిచెల్లగలడు

ఆ రెండింటి విషయంలో 'దుర్గారావు' నేర్పరి.

తను కుర్మా చేస్తే దానిముందు కోడి కుర్మా బలాదూర్. అందుకే దుర్గారావు ఎక్కడుంటే జనం అక్కడుంటారు.

ఆ హోటేలు కళకళలాడుతుంది

షావుకారి గల్లా పెట్టె గలగల మంటుంది.

దుర్గారావు పేరు దుర్గారావేగాని దుర్గారావుకాదు

దుర్గమ్మకూడా కాదు

రెంటికీ నడుమా ఉంటాడు.

ఎక్కడ పుట్టాడో తెలియదు. ఎవరన్నా బంధువులున్నారా అంటే తెలియదు. వంటరిగా ఉంటాడు. సాయంకాలానికల్లా పనులన్నీ పూర్తి చేసుకొని, చక్కగా స్నానం చేసి 'మాయం' అయిపోతాడు. తిరిగి తెల్లవారేలోగా వస్తాడు.

దుర్గారావు 'క్లీన్' కుర్రాళ్ళని చెడగొడతాడని గుసగుసలు చెప్పుకుంటారు. అతని మీద తోటిపనివారు జోకులు పేల్చుతారు. అవలా ఉంచితే దుర్గారావుకి కొన్ని పద్ధతులున్నాయి. "అగ్ మార్కు" వారూ, "ఐయస్.ఐ" వారూ రాజీ పడగలరేమోగానీ తను మాత్రం మెట్టుదిగడు.

అతను సాంబారు కాయాలంటే-

పెద్ద తట్టెడు 'టమోటా' లు కావాలి. కందిపప్పు చాలినంత ఇవ్వాలి. అందులోకి ఏ దినుసులు కావాలంటే అవి అందించాలి. అపుడు చూడాలి. తెలతెలవారుతుంటుంది. ఎటు చూసినా సాంబారు ఘుమ ఘుమ. జనం పరుగులు తీసుకుంటూ వస్తారు. ఏ మాత్రం ఆలస్యం చేసినా సాంబారు అయిపోతుంది

సాయంకాలం అయితే చపాతీ కుర్మా కవ్విస్తుంటుంది.

అందుకు ఎంత మషాళాఖర్చవుతుందా అనేది లెక్కలు చూడకూడదు..

అపుడపుడూ దుర్గారావు 'హాల్లోకి' తొంగి చూస్తాడు.

తింటున్న జనాన్ని చూస్తాడు.

అపుడతని కళ్ళు మెరుస్తాయి!

జనం 'ఇంకో' రకంగా ఊహిస్తారు.


అయితే దుర్గారావు ఏ హోటల్‌లోనూ ఎక్కువకాలం ఉండడు.

తరచుగా ఊర్లు మారతాడు.

అందుకు అందరూ చెప్పుకునేది అతనికి 'కొత్త' అనుభవాలు కావాలి.

అంచేత దుర్గారావు కోసం వేట సాగుతుంటుంది.

కొత్తగా హోటేలు పెట్టేవారూ, 'యాపారం' పడిపోయినవారూ తనకోసం వెతుక్కుంటారు. అతని వెనక కథ అది.




* * *

గుర్నాథం'గారి' బామ్మర్దికి తెలిసిందొకటే

అది హోటేలు!

తనేం మాట్లాడినా అది హోటేలుదో, హోటేళ్ళదో అయి ఉంటుంది.

ఏ వూరెళ్ళినా చూపంతా ఆటిమీదే

ఇడ్లీతింటే ఉప్పు ఎక్కువయిందనో, కాఫీలో డికాషన్ తగ్గిందనో, అట్టులో జిగురు లేదనో చెబుతాడు.

రాత్రి పదిగంటల తర్వాత కుర్చీలు బయటవేసుకున్నప్పుడు మాత్రం రాజకీయాల గురించి, డిటెక్టివ్ పుస్తకాల గురించి చెబుతాడు.

దుర్గారావుని వెతికేముందు 'కూపీ' లాగేడు. అలా ముందుకుపోతే 'యిశాపట్నం' లో దొరికేడు.

తన్తో రహస్యంగా మాట్లాడేడు.

ఆ సాయంకాలం ఇద్దరూ కల్సి మందుకొట్టేరు.

"నీ సాంబారు ముందు ఈ మందేం పనికొచ్చుద్దెహో" అన్నాడు బామ్మర్ది

దుర్గారావు నవ్వేడు

కొద్దిగానే పుచ్చుకున్నాడు

"అడ్వాన్స్ ఇచ్చేతన్నా" అన్నాడు

రొండురోజులు ఆగేమన్నాడు

ఆగాడు బామ్మర్ది

ఆ రొండ్రోజులూ మందేసుకుని హోటేల్లవెంట తిరిగి నానా టిఫిన్లూ భోంచేసేడు దుర్గారావు 'యిశాపట్నం' నుండి వొచ్చేసేడు.

గుర్నాథంగారి హోటేల్ 'టాక్ ఆఫ్‌ది టౌన్' అయింది.

రిక్షావారు రెండు ఇడ్లీలు తిని, రెండు ప్లేట్లు సాంబారు తాగితే సాయంకాలందాకా రిక్షాలు తొక్కేస్తున్నారు.

ఉద్యోగులు మధ్యాహ్నంపూట టిఫిన్లు తేవటం మానుకున్నారు.

నిరుద్యోగులూ - యువకులూ - డబ్బున్నవారూ - మధ్యతరగతివారూ - ఆస్తికులూ - నాస్తికులూ ఒకరనికాదు అందరూ ఆ సాంబారు - కుర్మాల ప్రభావంలో పడిపోయేరు.

బామ్మర్ది సూపర్‌వైజరయ్యేడు

గుర్నాథం ముందు 'హోర్లిక్స్' 'బోర్నవిటా' 'ఆర్లికస్సు' నాలుగు గిన్నెల నిండి చిల్లారావుంది

ఏం జనవేంజనవేంజనం!

నాలుగు నెల్లు గడిచిపోయాయి. అదేదో సిన్మాలో కిష్టుడిలా దుర్గారావు మాయం అయ్యేడు!

గుర్నాథం దిగులు పడలా!

బామ్మర్ది కూడా!

జనం ముందు పట్టించుకోలా. వాళ్ళా 'కెఫిటేరియా' కి వెళ్తూనే ఉన్నారు.

'సాంబారు టేస్ట్ తగ్గింది'

చపాతీకుర్మా చిక్కదనంపోయింది అంటున్నారు.

అయినా అటేవెళ్తున్నారు.

గుర్నాథం నునుపుదేలాడు.

బామ్మర్ది ఎరుపుతేలాడు.

పోయినవన్నీ దొరికేట్టే ఉన్నాయి.

రేత్రిపూట బామ్మర్దికి గుర్నాథం గీతోపదేశం చేశాడోరోజు.

"దుర్గడిని మూడునెల్లకంటే భరించటం కష్టం. ఆడుంటే జనాలకి మనల్ని తినిపించేత్తాడు. అందుకే హోటేలుకి పేరొగానే ఆడ్ని వొదిలించుకోవాల. ఆడోచోట ఉండకపోటానికి ఆదు మైనసయిపోటంకాదు"

అది నిజమే!

దుర్గారావు హాల్లోకి తొంగిచూసేది 'వల' వేయటంకోసం కాదు. తనుచేసిన వాటిని తింటున్న జనాల్ని చూసి తృప్తిపొందే కళాకారుడతను.

దుర్గారావుకీ ధీర ఉంది. డబ్బులు తీసుకుంటున్నందుకు నాణ్యమైన సరుకు అందించాలి. అలాచేస్తే షావుకార్లకి లాభాలు 'తగ్గుతాయి'

అందుకే కొత్త హోటేళ్ళు తెరిచేవారికి దుర్గారావు కావాలి.

దుర్గారావుకే కొత్త హోటేళ్ళుకావాలి!

కనీసం ఆ నాలుగు నెలలయినా మంచి 'తిండి' అందించవచ్చు!

దుర్గారావు 'మైనస్‌గాడురా' అనుకునే గుర్నాథాలకి

తనెప్పుడూ 'ప్లస్‌పాయింటే'

జనాలకు మాత్రం దు'గ్గమ్మ'!